క్లుప్తంగా

ప్రసన్నాంజనేయ విగ్రహ, ధ్వజస్తంభ ప్రతిష్ఠ



విగ్రహ, ధ్వజస్తంభ ప్రతిష్ఠ పూజలు నిర్వహిస్తున్న వేద పండితులు

నల్లజర్ల: ప్రకాశరావుపాలెం గ్రామంలోని కొత్త పేటలో నూతనంగా నిర్మించిన ఆలయంలో ఆదివారం ప్రసన్నాంజనేయ స్వామివారి విగ్రహ, ధ్వజస్తంభ ప్రతిష్ఠ వేడుక వైభవంగా జరిగింది. వేద పండితులు అయిలూరి వేణుగోపాలశర్మ బృందం ఆధ్వర్యంలో గణపతి పూజ, పుణ్యాహవచనం, యంత్ర ప్రతిష్ఠ, అఖండ దీపారాధన, సకల దేవతలకు హోమం నిర్వహించారు. గ్రామం అంతా బంధువులు, భక్తులతో పండగ వాతావరణం నెలకొంది. ఈ సందర్భంగా అన్న సమారాధన జరిగింది.

ఆలయ పునఃనిర్మాణానికి శ్రీకారం



మంజూరు పత్రాలను ఆలయ కమిటీ సభ్యులకు అందిస్తున్న ఈఓ వెంకట్రావు

ఉండ్రాజవరం: శిథిలావస్థకు చేరుకున్న తాడిపర్రు గ్రామంలోని పార్వతీ సమేత సోమేశ్వర స్వామి వారి ఆలయ పునః నిర్మాణానికి ఆ గ్రామ పెద్దలు సంకల్పించారు. ఈ ఆలయ పునః నిర్మాణానికి తాడిపర్రు పంచాయతీ మాజీ సర్పంచ్ మట్టా సత్యనారాయణ రూ.27.50 లక్షలను విరాళంగా ప్రకటించినట్టు ఆ దేవస్థానం కార్యనిర్వహణాధికారి ఎం.వెంకట్రావు ఆదివారం తెలిపారు. ప్రభుత్వం, గ్రామంలోని భక్తులు, దాతల సహకారంతో రూ.1.50 కోట్ల అంచనా వ్యయంతో నూతన ఆలయ నిర్మాణానికి శ్రీకారం చుట్టినట్టు చెప్పారు. మ్యాచింగ్ సొమ్ముతో కలిపి ఈ ఆలయ నిర్మాణానికి దేవదాయ, ధర్మదాయ శాఖ రూ. 80 లక్షలు మంజూరు చేసినట్లు ఈఓ వెల్లడించారు. ఈమేరకు మంజూరు పత్రాన్ని ఏఓ వెంకట్రావు ఆధ్వర్యంలో ఆలయ కమిటీ సభ్యులు, పెద్దలకు అందజేశారు.

కౌన్సిలర్ సుప్రియకు సన్మానం

నిడదవోలు: రాజమహేంద్రవరంలో సీఎంఆర్ జ్యూవెలరీ విభాగంలో ఆదివారం జరిగిన కల్యాణమస్తు సేల్ ప్రారంభోత్సవానికి నిడదవోలు పట్టణ కౌన్సిలర్ కొత్తపల్లి సుప్రియ ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈసందర్భంగా సుప్రియను సీఎంఆర్ షాపింగ్ మాల్ సిబ్బంది ఘనంగా సన్మానించారు.

బసివిరెడ్డిపేటలో కంటి వైద్య శిబిరం

నిడదవోలు రూరల్: నిడదవోలు పునీత్ ఐ క్లినిక్ ఆధ్వర్యంలో స్థానిక బసివిరెడ్డిపేటలో ఆదివారం ఉచిత కంటి వైద్యశిబిరం నిర్వహించారు. ఈ శిబిరాన్ని కౌన్సిలర్ మేడపాటి సరిత ప్రారంభించారు. కంటి వైద్యుడు మానేపల్లి స్వామినాయుడు సుమారు 105 మందికి కంటి పరీక్షలు నిర్వహించారు. అవసరమైన వారికి ఉచితంగా మందులు అందజేశారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకులు, స్థానిక వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

బస్టాండ్ స్థలదాతకు ప్రయాణికుల అభినందనలు



బీరపల్లి క్రిష్ణ కిషోర్‌రెడ్డి (ఫైల్)

గోపాలపురం: ఆర్టీసీ బస్టాండ్ నిర్మాణానికి గోపాలపురంలో రూ.4.6 కోట్ల విలువైన 46 సెంట్ల స్థలాన్ని విరాళంగా ఇచ్చిన బీరపల్లి జమిందార్ కుమారుడు క్రిష్ణ కిషోర్ రెడ్డిని ఆదివారం ఇక్కడి ఆయన ఇంటివద్ద గ్రామస్తులు, ప్రయాణికులు కలసి అభినందనలు తెలిపారు. ఆర్టీసీ బస్టాండ్ నిర్మాణానికి ఎంతో విలువైన స్థలాన్ని విరాళంగా ఇచ్చినందుకు వారు హర్షం వ్యక్తం చేశారు. ఈ స్థలాన్ని ఆర్టీసీ కాకినాడ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ అరుణ్‌కుమార్, కొవ్వూరు డిపో మేనేజర్ వైవీఎస్ కుమార్‌లు మూడు రోజుల క్రితం పరిశీలించారు. గోపాలపురం- కొయ్యలగూడెం బైపాస్ రోడ్‌లో ఈ స్థలం ఉంది.

ఈదురు గాలులు.. కరెంట్ సరఫరా నిలిపివేత

కొవ్వూరు: బంగాళాఖాతంలో ఏర్పడిన ఉపరితల అవర్తమానం ప్రభావంతో ఆదివారం రాత్రి ఏడు గంటల నుంచి ఈదురుగాలులు వీచాయి.దీంతో కొవ్వూరులో గంటన్నర సేపు విద్యుత్తు సరఫరాను నిలిపివేశారు. పట్టణంలో అంధకారం అలముకుంది. రాత్రి 8.45 గంటలకు మళ్లీ సరఫరాను పునరుద్ధరించారు. గాలుల ప్రభావంతో పలుచోట్ల చెట్ల కొమ్మలు విరిగి పడ్డాయి.పలుచోట్ల చెదురుమదురుగా చినుకులు పడ్డాయి.

మద్యం సేవిస్తున్న 16 మంది అరెస్ట్

నిడదవోలు రూరల్: మండలంలోని విజ్జేశ్వరం గ్రామంలోని గోదావరి డాబా రెస్టారెంట్‌లో నిబంధనలకు విరుద్ధంగా అక్రమంగా మద్యం సేవిస్తున్న 16 మందిని అరెస్ట్ చేసినట్టు ఎస్ఈబీ నిడదవోలు సీఐ కె.వీరబ్రహ్మం ఆదివారం తెలిపారు. డాబా రెస్టారెంట్ నిర్వాహకుడు యర్రా వెంకటనారాయణతో పాటు మద్యం సేవిస్తున్న 15 మందిని అరెస్ట్ చేసినట్లు పేర్కొన్నారు.

స్వాతంత్ర్య పోరులో అల్లూరి పాత్ర అమోఘం



వద్దూరులో అల్లూరి విగ్రహానికి పూలమాల వేస్తున్న కఠారి సిద్ధార్థరాజు



దొండపూడిలో అల్లూరి విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న న్యూ డెమొక్రసీ నాయకులు

ఉండ్రాజవరం: స్వాత్రంత్ర్య పోరాటంలో అల్లూరి పాత్ర అమోఘమైందని, బ్రిటిష్ ప్రభుత్వాన్ని గడగడలాడించిన పోరాట యోధుడని అల్లూరి సీతారామరాజు సేవాసమితి అధ్యక్షుడు కఠారి సిద్ధార్థరాజు అన్నారు. అల్లూరి వర్ధంతి సందర్భంగా ఆదివారం మండలంలోని వద్దూరులోని అల్లూరి విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. కార్యక్రమంలో డాక్టర్ కోసూరి సత్యనారాయణ రాజు, వేగేశ్న నాగరాజు, సర్పంచ్ రఘుమండ తేజశ్రీ , ఎంపీటీసీ సభ్యురాలు వేండ్ర అనంత లక్ష్మి, భూపతిరాజు సురేష్, దాట్ల శివరామరాజు, కె.కృష్ణంరాజు, అల్లూరి సత్యనారాయణరాజు, ఉండి శ్రీను, రఘుమండ నాగరాజు, రుద్రరాజు గోపాల కృష్ణంరాజు తదితరులు పాల్గొన్నారు.

గోపాలపురం: మన్యం వీరుడు అల్లూరి సీతారామరాజు వర్ధంతిని ఆదివారం న్యూ డెమొక్రసీ పార్టీ ఆధ్వర్యంలో మండలంలోని దొండపూడి గ్రామంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆ పార్టీ జిల్లా నాయకుడు పోరండ్ల శ్రీనివాస్ మాట్లాడుతూ బ్రిటిష్ వలస పాలనకు వ్యతిరేకంగా పోరాడి చిన్న వయసులోనే వీరమరణం పొందిన త్యాగశీలి అల్లూరి సీతారామరాజు అన్నారు. ఆ పార్టీ నాయకులు ముక్కారెడ్డి, జిల్లా కార్యదర్శి కురసం లత, పలువురు నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

నిడదవోలు పట్టణంలో..

నిడదవోలు: మన్యం వీరుడు అల్లూరి సీతారామరాజు వర్ధంతిని పట్టణంలో ఐఎఫ్‌టీయూ ఆధ్వర్యంలో నిర్వహించారు. స్థానిక పశువుల ఆసుపత్రి వద్ద, గాంధీనగర్‌లోని అల్లూరి సీతారామరాజు విగ్రహాలకు ఐఎఫ్‌టీయూ జిల్లా సహాయ కార్యదర్శి ఈమని గ్రీష్మకుమార్ పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో అభ్యుదయ పెయింటర్స్ నాయకులు ఆర్.సురేష్‌కుమార్, బి.నాగేంద్ర, కార్తీక్, చైతన్య తదితరులు పాల్గొన్నారు.

జీవిత బీమా ఏజెంట్ల మహాసభల పోస్టర్ ఆవిష్కరణ



కరపత్రాలు విడుదల చేస్తున్న ఎల్ఐసీ ఏజెంట్స్ ఆర్గనైజేషన్ ఆఫ్ ఇండియా ప్రతినిధులు

ఉండ్రాజవరం: ఈ నెల 22, 23 తేదీల్లో విశాఖపట్నంలోని అల్లూరి సీతారామరాజు విజ్ఞాన కేంద్రంలో నిర్వహించే ఎల్ఐసీ ఏజెంట్స్ ఆర్గనైజేషన్ ఆఫ్ ఇండియా ఆరో అఖిల భారత మహాసభలు విజయవంతం చేయాలని ఆ సంస్థ సౌత్ సెంట్రల్ జోన్ ప్రధాన కార్యదర్శి పీఎల్ నరసింహారావు కోరారు. మండలంలోని పాలంగి సాయిబాబా ఆలయం వద్ద ఆదివారం నిర్వహించిన ఎల్ఐసీ ఏఓఐ రాజమహేంద్రవరం డివిజన్ ఈసీ సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా మహాసభల కరపత్రాలను విడుదల చేశారు. సమావేశంలో పలువురు మాట్లాడుతూ ప్రస్తుతం ఎల్ఐసీ ఎదుర్కొంటున్న ఐపీఓ, బీమా సుగం, ఐఆర్డీఏ డ్రాఫ్ట్‌లకు వ్యతిరేకంగా ఏఓఐ పోరాటాలు చేస్తోందన్నారు. కేంద్ర ప్రభుత్వ విధానాల వలన ప్రభుత్వం రంగ సంస్థలు నిర్వీర్యం అవుతున్నాయన్నారు. ప్రపంచంలోనే అగ్రగామిగా ఉన్న ఎల్ఐసీని ప్రైవేట్‌పరం చేసే దిశగా సాగుతున్న చర్యలను అడ్డుకోవాలని పలువురు కోరారు. కార్యక్రమంలో రాజమహేంద్రవరం డివిజన్ అధ్యక్షుడు వై.విశ్వేశ్వరరావు, నాయకులు టి.కోటేశ్వరరావు, జి.రవికిషోర్, కె.నాగిరెడ్డి, రాచూరి రామకృష్ణ, వై.జాన్‌బాబు, సత్తి పాండురంగారెడ్డి, సలాది ఉదయ భాస్కరరావు తదితరులు పాల్గొన్నారు.

ఐదుగురిపై వరకట్న వేధింపుల కేసు

కొవ్వూరు: అదనపు కట్నం వేధింపుల అభియోగంపై ఐదుగురిపై కొవ్వూరు పట్టణ పోలీసులు కేసు నమోదు చేశారు. పట్టణ ఎస్సై బి.దుర్గా ప్రసాద్ తెలిపిన వివరాలిలా ఉన్నాయి. మండలంలోని దొమ్మేరు గ్రామానికి చెందిన వాడవెల్లి కనక సీతామహాలక్ష్మికి ముంబైకు చెందిన సాయినాథ్ లక్ష్మణ్ నార్‌కర్‌తో 2005లో వివాహమైంది. నార్‌కర్‌కు గతంలో వేరొక మహిళతో వివాహమైంది. దూరపు బంధువు కావడంతో సాయినాథ్ లక్ష్మణ్ నార్‌కర్‌కు సీతామహాలక్ష్మిని ఇచ్చి వివాహం చేశారు. ఇటీవల అదనపు కట్నం కోసం ఆమెను భర్తతో పాటు అత్తమామలు, ఆడపడుచు, ఆమె భర్త వేధించ సాగారు. దీనిపై బాధితురాలు ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఆ ఐదుగురిపై కేసు నమోదు చేసినట్టు ఎస్సై తెలిపారు.

తడిసిన, మొలకెత్తిన ధాన్యం కొనుగోలు చేస్తాం



ఆర్‌బీకేలో ధాన్యం తేమ శాతాన్ని పరిశీలిస్తున్న జిల్లా ప్రత్యేకాధికారి వివేక్ యాదవ్, జేసీ తేజ్‌భరత్

కొవ్వూరు: ప్రభుత్వం నిర్దేశించిన ధరకు తడిసిన, మొలకెత్తిన ధాన్యాన్ని కూడా కొనుగోలు చేస్తామని, రైతులు అధైర్య పడాల్సిన పని లేదని సీఆర్‌డీఏ కమిషనర్, జిల్లా ప్రత్యేకాధికారి వివేక్ యాదవ్ అన్నారు. దొమ్మేరు రైతుభరోసా కేంద్రంలో ధాన్యం కొనుగోళ్లను, ధాన్యంలో తేమ శాతాన్ని ఆదివారం ఆయన పరిశీలించారు. అనంతరం రహదారి వెంబడి పొలాల్లో ఆరబెట్టిన ధాన్యాన్ని పరిశీలించి, రైతులతో మాట్లాడారు. గోనె సంచుల సరఫరాలోను, విరిగిన ధాన్యం కొనుగోలులోను మిల్లర్ల నుంచి ఎదురవుతున్న ఇబ్బందులను రైతులు ఆయనకు వివరించారు. జాయింట్ కలెక్టర్ ఎస్.తేజ్‌భరత్ మాట్లాడుతూ, రైతుల నుంచి ధాన్యం పూర్తి స్థాయిలో కొనుగోలు చేస్తామని చెప్పారు. ఆఫ్‌లైన్‌లో కూడా కొనుగోలు చేస్తున్నామని అన్నారు. ఇప్పటికే అన్నీచోట్లా ధాన్యం కొనుగోళ్ల జోరుగా సాగుతున్నాయని చెప్పారు. కార్యక్రమంలో ఆర్‌డీఓలు ఎస్.మల్లిబాబు, ఎ.చైత్రవర్షిణి, జిల్లా వ్యవసాయ అధికారి ఎస్.మాధవరావు, డీఎస్ఓ పి.ప్రసాదరావు, పౌర సరఫరాల డీఎం వి.నాగార్జునరెడ్డి, వ్యవసాయాధికారి గంగాధరరావు, తహసీల్దార్ బి.నాగరాజు నాయక్ తదితరులు పాల్గొన్నారు.

అనుకూలించిన వాతావరణం

పెరవలి: ఆదివారం వర్షం కురవలేదు. దానికితోడు ఎండ కాయడంతో రైతులు ధాన్యపు రాశులను విడగొట్టి రోడ్లపై అరబెట్టారు. వర్షాలు రాకుండా ఉంటే మొత్తం పంటలో 80 శాతం ఇప్పటికే ఒబ్బిడి అయ్యేదని రైతులు పేర్కొంటున్నారు. మరో తుపాను హెచ్చరించడంతో ముందుగానే పంటలను రక్షించుకునే పనిలో రైతులు నిమగ్నం అయ్యారు.

ప్రభుత్వ స్కూళ్ల టాపర్లు

సాక్షి, న్యూస్ నెట్‌వర్క్: ఈ ఏడాది పదో తరగతి పరీక్ష ఫలితాల్లో ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులు సత్తా చాటారు. సరైన వసతులు, మంచి బోధన, చక్కని వాతావరణం అందిస్తే కార్పొరేట్ పాఠశాలల విద్యార్థులకు తామేమీ తీసిపోమని శనివారం విడుదలైన ఫలితాల్లో వారు రుజువు చేశారు. కొవ్వూరు, నిడదవోలు, గోపాలపురం నియోజకవర్గాల పరిధిలో అత్యధిక మార్కులు సాధించిన విద్యార్థినీ,విద్యార్థుల పేర్లు, ఆ పక్కనే బ్రాకెట్లో మొత్తం 600 మార్కులకు వారు పొందిన మార్కులు, వారు చదివిన పాఠశాల, మండలం వివరాలను ఈ క్రింద ఇస్తున్నాం.



షఫియా (561) యాదవోలు జెడ్పీ హైస్కూల్, దేవరపల్లి మండలం



ఎస్‌కే రయాన్ (560) దేవరపల్లి జెడ్పీ హైస్కూల్



పి.దేవీసంజన (560) దేవరపల్లి జెడ్పీ హైస్కూల్



ఏఎస్‌వీఎస్ఎస్. ప్రసాద్ (584), ప్రకాశరావుపాలెం జెడ్పీ హైస్కూల్, నల్లజర్ల మండలం



యంత్రపాటి సంగీత (577), సింగరాయపాలెం జెడ్పీ హైస్కూల్, నల్లజర్ల మండలం



కె.అనిల్‌కుమార్ (573) తాళ్లపూడి జెడ్పీ హైస్కూల్



షేక్ లాల్ మహమద్ (556) చాగల్లు జెడ్పీ హైస్కూల్



టి.మౌనికా దేవి (550), ఊనగట్ల జెడ్పీ హైస్కూల్, చాగల్లు మండలం



ఎ.ప్రసన్న (561) నిడదవోలు జెడ్పీ హైస్కూల్



వీపీఈ ప్రసాద్ (557) ఖండవల్లి జెడ్పీ హైస్కూల్, పెరవలి మండలం



అంబటి మాధురి (576) సూర్యారావుపాలెం హైస్కూల్ ఉండ్రాజవరం మండలం



తిల్ల సలోమి(572) సత్యవాడ హైస్కూల్, ఉండ్రాజవరం మండలం



జీఎస్.అనూష దుర్గ(585) వాడపల్లి హైస్కూల్, కొవ్వూరు మండలం



డి.తేజస్విని((565) వాడపల్లి హైస్కూల్, కొవ్వూరు మండలం



బి.అంజన((560) వాడపల్లి హైస్కూల్, కొవ్వూరు మండలం

ముగిసిన పుట్టాలమ్మ జాతర

నిడదవోలు రూరల్: మండలంలోని సూరాపురం గ్రామ దేవత పుట్టాలమ్మ తల్లి జాతర మహోత్సవాలు ఆదివారం ఘనంగా ముగిశాయి. ప్రధాన వీధిలో కొలువైన పుట్టాలమ్మను అధిక సంఖ్యలో భక్తులు దర్శించుకున్నారు. భక్తులంతా అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించి నైవేద్యాలు సమర్పించారు. జాతరకు వచ్చిన ఆడపడుచులు, బంధువులతో గ్రామమంతా కళకళలాడింది. నిడదవోలు సీఐ వెంకటేశ్వరరావు ఆధ్వర్యంలో పోలీసులు బందోబస్తు నిర్వహించారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ మండల శాఖ అధ్యక్షుడు అయినీడి పల్లారావు, ఎంపీపీ తిరుమళ్ల భాగ్యలక్ష్మి, జెడ్పీటీసీ సభ్యుడు కొయ్యే సూరిబాబు, ఏఎంసీ చైర్మన్ వెలగన పోలయ్య, సర్పంచులు వద్దిరెడ్డి శ్రీలక్ష్మి, తిక్కా శ్రీను, ముప్పిడి చంద్రశేఖర్, ఎంపీటీసీ సభ్యుడు పడాల రంగారావు, సొసైటీ అధ్యక్షులు యాళ్ల రామారావు, గజ్జరపు శ్రీరమేష్, సుంకవల్లి శ్రీహరి, వైఎస్సార్ సీపీ నాయకులు ముళ్లపూడి శ్రీనివాస్‌కుమార్ చౌదరి, వద్దిరెడ్డి శ్రీను, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

ఘనంగా మహాలక్ష్మమ్మ ఉత్సవాలు

తాళ్లపూడి: మండలంలోని వేగేశ్వరపురం గ్రామదేవత మరిడి మహాలక్ష్మి అమ్మవారి ఉత్సవాలను ఆదివారం ఘనంగా నిర్వహించారు. గ్రామం పాడిపంటలతో సుభిక్షంగా ఉండాలనే మొక్కుతూ ఏటా మే నెలలో వచ్చే పౌర్ణమి నాడు అమ్మవారి ఉత్సవాలు నిర్వహించడం ఆనవాయితీగా వస్తోంది. ఉత్సవాల సందర్భంగా అమ్మవారి సిరిబొమ్మను గరగ నృత్యాలతో గ్రామంలో ఊరేగించారు. ఉదయం నుంచి గ్రామస్తులు అమ్మవారికి నైవేద్యాలు సమర్పించి విశేష పూజలు చేశారు. కార్యక్రమంలో సర్పంచ్ కొమ్మిరెడ్డి పరశురామారావు, గ్రామ పెద్దలు, అధిక సంఖ్యలో మహిళలు గ్రామస్తులు శిరిబొమ్మ ఉత్సవంలో పాల్గొన్నారు.

బల్లిపాడులో విగ్రహాల ప్రతిష్ఠ

మండలంలోని బల్లిపాడులోని కోదండ రామాలయంలో విగ్రహాల పునఃప్రతిష్ఠాపన మహోత్సవాన్ని ఆదివారం వైభవంగా నిర్వహించారు. వేద పండితుల ఆధ్వర్యంలో ప్రత్యేక పూజల అనంతరం లక్ష్మణ,సీతా రాముల విగ్రహాలను ఆలయంలో ప్రతిష్ఠించారు. పలువురు దంపతులు పీటలపై కూర్చుని పూజలు చేశారు. ఆలయాన్ని గ్రామస్తులు, దాతల సహకారంతో నిర్మించినట్టు కమిటీ సభ్యులు తెలిపారు. అనంతరం అన్నసమారాధన నిర్వహించారు. సర్పంచ్ ఎల్లిన శివరామకృష్ణ, అధిక సంఖ్యలో గ్రామస్తులు, మహిళలు పాల్గొన్నారు.

కోటసత్తెమ్మ ఆదాయం రూ.1.25 లక్షలు

నిడదవోలు రూరల్: మండలంలోని తిమ్మరాజుపాలెంలో కొలువైన కోటసత్తెమ్మ వారి ఆలయానికి ఆదివారం భారీఎత్తున భక్తులు తరలి వచ్చి పూజలు నిర్వహించారు. ఆలయ ప్రధానార్చకుడు అప్పారావు శర్మ పర్యవేక్షణలో అమ్మవారికి ప్రత్యేక పుష్పాలంకరణ చేశారు.దర్శనాలు, ప్రసాదం, పూజా టిక్కెట్లు, ఫొటోల అమ్మకం ద్వారా రూ.1,25,414 ఆదాయం వచ్చినట్లు ఆలయ ఈఓ బళ్ల నీలకంఠం (శివ) పేర్కొన్నారు.